కంగనా గో బ్యాక్

హిమాచల్‌లో నల్లజెండాలతో స్థానికుల నిరసనలు

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో 'మండి' నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి, సినీ నటి కంగనా రనౌత్‌కు ఎన్నికల ప్రచారంలో సోమవారం చేదు అనుభవం ఎదురైంది. లాహౌల్, స్పితి జిల్లాలో కంగనకు స్థానికుల నుంచి ఆగ్రహం వ్యక్తమైంది. హిమాచల్ బీజేపీ చీఫ్ జైరామ్ ఠాకూర్, మరికొంత మంది పార్టీ నాయకులతో కలిసి కంగనా వెళ్తున్న కాన్వాయ్ కాజాకు చేరుకోగా, వందల మంది ప్రజలు నల్ల జెండాలు ఊపి తమ నిరసన వ్యక్తం చేశారు. 'కంగనా వంగనా సహీ చలేగా' (కంగనా మాకోసం పనిచేయనక్కర్లేదు).. అంటూ ఆమెపై స్థానికులు వ్యతిరేకతను చూపారు. దలైలామాపై గత ఏడాది ఏప్రిల్‌లో కంగనా చేసిన వ్యాఖ్యల ఫలితమే తాజా నిరసనలకు దారితీసిందని సమాచారం.

ఐదో దశలో 59% పోలింగ్

బెంగాల్‌లో అత్యధికం.. మహారాష్ట్రలో అత్యల్పం

బారాముల్లాలో 59% పోలింగ్‌తో ఆల్‌టైమ్ రికార్డు

ఇప్పటికి 428 లోక్‌సభ స్థానాల్లో పూర్తైన ఎన్నికలు

న్యూఢిల్లీ, మే 20: పలుచోట్ల చెదురుమదురు ఘటనలు మినహా లోక్‌సభ ఐదో దశ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఆరు రాష్ట్రాలు, రెండు యూటీల్లోని 49 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 59.06 పోలింగ్ శాతం నమోదైందని ఈసీ వెల్లడించింది. పశ్చిబెంగాల్‌లో అత్యధికంగా 73.14 శాతం పోలింగ్ నమోదు కాగా, మహారాష్ట్రలో అత్యల్పంగా 53.51 శాతం మంది మాత్రమే ఓటేశారు. ఈ దశలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తదితర ప్రముఖులు బరిలో ఉన్నారు. 2019లో ఏడు రాష్ట్రాల్లోని 51 స్థానాలకు జరిగిన ఐదో దశ లోక్‌సభ ఎన్నికల్లో 64.16% పోలింగ్ నమోదైంది. తాజాగా లోక్‌సభ ఎన్నికల ఐదో దశ ముగియడంతో ఇప్పటి వరకు మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు 25 రాష్ట్రాలు/యూటీల్లో 428 నియోజకవర్గాలకు ఎన్నికలు పూర్తయ్యాయి. ఈనెల 25న ఆరో దశ, జూన్ 1న చివరి దశ జరుగనున్నాయి.

బారాముల్లా చరిత్రలో అత్యధిక పోలింగ్

జమ్ముకశ్మీర్‌లోని బారాముల్లా నియోజకవర్గం 59% పోలింగ్ నమోదుతో ఆల్‌టైమ్ రికార్డు కొట్టింది. కొన్ని దశాబ్దాలుగా సింగిల్ డిజిట్ పోలింగ్ నమోదయ్యే బారాముల్లా పరిధిలోని సోపోర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి 44.36% మంది ఓటేశారని జమ్ముకశ్మీర్ ఎన్నికల ప్రధానాధికారి పీకే పోల్ తెలిపారు. ఇక్కడ 17.37 లక్షల మంది ఓటర్లు ఉండగా.. ఈసారి మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా సహా 22 మంది బరిలో ఉన్నారు.

పలు చోట్ల హింసాత్మక ఘటనలు

పశ్చిమబెంగాల్‌లో పలు చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకొన్నాయి. బకర్‌పోర్, బొంగావ్, ఆరంబాఘ్, హుగ్లీలలో బీజేపీ, టీఎంసీ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. పశ్చిబెంగాల్‌తోపాటు ఒడిశాలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. తమ గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు రోడ్డు, రైలు కనెక్టివిటీ కల్పించనందుకు నిరసనగా యూపీలోని కౌశాంబి జిల్లా హిసంపూర్ మధో గ్రామ ప్రజలు పోలింగ్‌ను బహిష్కరించారు. వివిధ పార్టీల నుంచి *1,913* ఫిర్యాదులు వచ్చాయని ఎన్నికల సంఘం పేర్కొన్నది.

2019 కంటే 2.5 కోట్ల ఓట్లు అధికం

తొలి 4 దశల పోలింగ్‌పై ఎస్‌బీఐ నివేదిక

న్యూఢిల్లీ, మే 20: లోక్‌సభ ఎన్నికల తొలి నాలుగు దశల్లో 2019తో పోలిస్తే దాదాపు 2.5 కోట్ల ఓట్లు అధికంగా పోల య్యాయని ఎస్‌బీఐ తాజా పరిశోధనా నివేదిక పేర్కొన్నది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం డాటాను ఉటంకించింది. నాలుగు దశల ఎన్నికల్లో 45.1 కోట్ల మంది ఓటేశారని, మొత్తంగా 66.95 పోలింగ్ శాతం నమోదైందని తెలిపింది. అయితే శాతం పరంగా చూస్తే 2019 ఎన్నికల సమయంలో నాలుగు విడతల్లో 68.15 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించింది. పోలింగ్ జరిగిన 90 శాతం నియోజకవర్గాల్లో పోలైన ఓట్లు పెరుగడమో లేదా గత ఎన్నికలతో పోలిస్తే అటుఇటూగా ఉండటమో జరిగింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తంగా దాదాపు 67.5 శాతం పోలింగ్ నమోదవుతుందని అంచనా వేసింది.

తొలి నాలుగు విడతల్లో ఎన్నికలు జరిగిన లోక్‌సభ స్థానాలు- 379	
2019తో పోలిస్తే 2024లో పోలింగ్ ఇలా..	
50 వేల కంటే అధికంగా ఓట్లు పోలైన నియోజకవర్గాలు- 181	
50 వేల కంటే తక్కువ ఓట్లు నమోదైన నియోజకవర్గాలు- 36	
2024లో ఓట్లు పెరిగిన రాష్ట్రాలు	
కర్ణాటక	35.5 లక్షలు
తెలంగాణ	31.9 లక్షలు
మహారాష్ట్ర	20 లక్షలు
2024లో ఓట్లు తగ్గిన రాష్ట్రాలు	
కేరళ	5.3 లక్షలు
మణిపూర్	3.4 లక్షలు
పెరిగిన 100 పురుషుల ఓట్లకు మహిళల ఓట్ల నిష్పత్తి- 110	
మహిళా ఓట్లు పెరిగిన నియోజకవర్గాలు- 270 స్థానాలు	

ఆప్‌కు 7 కోట్లకుపైగా విదేశీ నిధులు!

- ఎఫ్‌సీఆర్‌ఏ కింద విచారణ జరపాలని కేంద్రానికి ఈడీ లేఖ
- ఆప్‌పై ప్రధాని మోదీ కుట్ర: అతిశీ

న్యూఢిల్లీ, మే 20: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)పై మరో ఉచ్చు బిగిస్తున్నది. ఎఫ్‌సీఆర్‌ఏ (విదేశీ విరాళాల నియంత్రణ చట్టం) నిబంధనలకు విరుద్ధంగా ఢిల్లీ, పంజాబ్‌లలో అధికార పార్టీ ఆప్‌కు రూ.7 కోట్లకుపైగా విదేశీ నిధులు అందాయని ఈడీ ఆరోపించింది. ఈమేరకు కేంద్ర హోంశాఖకు సోమవారం లేఖ రాసింది. ఈ వ్యవహారంపై ఎఫ్‌సీఆర్‌ఏ, ప్రజా ప్రాతినిధ్యం చట్టం కింద విచారణ చేపట్టాలని ఈడీ కోరింది. '2015, 2016లలో అమెరికా, కెనడాలో నిధుల సేకరణ చేపట్టిన ఆప్‌కు రూ.7.08 కోట్లు విదేశీ నిధులు అందాయి. దీంట్లో విదేశీ దాతల గుర్తింపు, జాతీయతలను తారుమారు చేసింది. అలాగే ఇతర వివరాలు మార్చింది' అని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. కెనడాకు చెందిన కొంతమంది దాతల పేర్లను పార్టీ ఫైనాన్షియల్ రికార్డ్స్‌లో ఆప్ దాచిపెట్టిందని హోం శాఖకు ఈడీ తెలిపింది. 'ఎఫ్‌సీఆర్‌ఏ ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల్ని సాధారణంగా సీబీఐ విచారిస్తుంది. ఆప్‌ను ఉద్దేశించి ఈడీ చేసిన ఆరోపణలపైనా కేంద్ర హోంశాఖ చర్యలు చేపట్టవచ్చు' అని ఈడీ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు.

ఢిల్లీ, పంజాబ్‌లో ఓటమిని తట్టుకోలేక..

ఈడీ ఆరోపణలపై ఆప్ నాయకురాలు అతిశీ స్పందించారు. ఆప్‌ను అప్రతిష్టపాల్జేసేందుకు ప్రధాని మోదీ చేసిన కుట్రగా ఆమె పేర్కొన్నారు. ఎప్పుడో 11 ఏండ్ల క్రితం నాటి కేసును తిరగతోడారని, ఇందులోని ఆరోపణలపై ఈడీ, సీబీఐ, కేంద్ర హోం శాఖ, ఎన్నికల కమిషన్‌కు అన్ని సమాధానాలూ పార్టీ తరపున ఇచ్చామని ఆమె అన్నారు. 'ఢిల్లీ, పంజాబ్‌లో మొత్తం 20 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ ఓడిపోనున్నది. అందువల్లే కేంద్ర దర్యాప్తు సంస్థల పేరుతో ఈ రాజకీయ కుట్రలకు బీజేపీ తెరలేపింది' అని అన్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసు, మలివాల్ కేసులు విఫలం కావటంతో, కొత్తగా ఈ కేసును (విదేశీ నిధులు) బీజేపీ తెరపైకి తీసుకొచ్చిందని ఆమె విమర్శించారు.

బీజేపీపై చర్యల్లో ఈసీ ఘోర వైఫల్యం

- టీఎంసీ ఫిర్యాదులపై సకాలంలో చర్యలు తీసుకోలేదు
- ఎన్నికల సంఘంపై కలకత్తా హైకోర్టు తీవ్ర అసంతృప్తి

కోల్‌కతా, మే 20: ఎన్నికల సంఘం తీరును కలకత్తా హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ లక్ష్యంగా మీడియాలో బీజేపీ ప్రకటనల ప్రచారాన్ని అడ్డుకోవడంలో ఈసీ విఫలమైందని కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. టీఎంసీని అప్రతిష్ఠ పాల్జేసేలా బీజేపీ ప్రకటనలకు సంబంధించి తృణమూల్ నేతల ఫిర్యాదులపై సకాలంలో ఈసీ తగిన చర్యలు తీసుకోపోవడాన్ని కోర్టు తప్పుబట్టింది. టీఎంసీకి వ్యతిరేకంగా ఎలాంటి అవమానకరమైన ప్రకటనలు ఇవ్వకుండా బీజేపీని నిషేధించడంతో పాటు ప్రకటనలను ప్రచారం చేయకుండా మీడియా సంస్థలను నియంత్రిస్తూ న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఫిర్యాదుల పరిష్కారంపై హైకోర్టు ఈ సందర్భంగా ఆశ్చర్యం వ్యక్తం చేసింది. టీఎంసీకి వ్యతిరేకంగా చేసిన ఆరోపణలు, ప్రకటనలు అప్రతిష్ఠ పాల్జేసేవని, ప్రత్యర్థులను అవమానించే ఉద్దేశంతో కూడుకొన్నవని, వ్యక్తిగత దాడుల వంటివని పేర్కొన్నది. సైలెన్స్ పీరియడ్‌లో(ప్రచారం ముగిసిన తర్వాతి సమయం), పోలింగ్‌కు ఒకరోజు ముందు బీజేపీ ఇచ్చిన ప్రకటనలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నాయని స్పష్టం చేసింది. ఇది టీఎంసీ హక్కులను, పౌరదర్శక ఎన్నికలకు సంబంధించి ప్రజల హక్కులను ఉల్లంఘించడమేనని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. తమ పార్టీకి వ్యతిరేకంగా బీజేపీ పలు పత్రికల్లో ఇచ్చిన ప్రకటనలపై ఇన్‌జంక్షన్ ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ తృణమూల్ కాంగ్రెస్ కలకత్తా హైకోర్టులో పిటిషన్ వేసింది.

మైనారిటీలకు వ్యతిరేకంగా ఎన్నడూ మాట్లాడలేదు!

ఎవరినీ 'ప్రత్యేక పౌరులు'గా అంగీకరించేది లేదు: మోదీ

భువనేశ్వర్, మే 20: తాను మైనారిటీలకు వ్యతిరేకంగా ఎన్నడూ మాట్లాడలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బీజేపీ కూడా మైనారిటీలకు వ్యతిరేకంగా ఇప్పుడు, ఎప్పుడూ పనిచేయదని ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పుకొచ్చారు. అయితే ఏ ఒక్కరినీ 'ప్రత్యేక పౌరులు'గా అంగీకరించేందుకు తాను సిద్ధంగా లేనని, అందరినీ సమానంగా చూస్తామని స్పష్టం చేశారు. అంబేద్కర్, నెహ్రూ సహా భారత రాజ్యాంగ నిర్మాతలు మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండకూడదని నిర్ణయించారని మోదీ అన్నారు. అయితే నేడు కాంగ్రెస్ సహా విపక్షాలు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని, దాన్ని ప్రజలకు చెప్పడం తన బాధ్యత అని పేర్కొన్నారు.

దక్షిణాదిన అతిపెద్ద పార్టీగా..

లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణాదిన బీజేపీ అతిపెద్దపార్టీగా అవతరిస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. జూన్ 4న వెల్లడి కానున్న ఫలితాల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 400 సీట్లకు పైగా వస్తాయని మరోసారి చెప్పారు. ఎన్నికల ఫలితాలపై స్టాక్ మార్కెట్‌లో నెలకొన్న భయాందోళనపై మోదీ స్పందించారు. జూన్ 4న భారత స్టాక్ మార్కెట్లు గత రికార్డులన్నింటినీ బద్దలు కొడతాయన్నారు. ఆ వారమంతా స్టాక్ మార్కెట్ ప్రోగ్రామర్లు పనితో అలసి పోతారని చెప్పారు.

వీలు చిక్కినప్పుడల్లా విద్వేషం!

మోదీ వ్యాఖ్యలను విపక్షాలు ఖండించాయి. సీపీఐ నేత డీ రాజా స్పందిస్తూ 'మహిళల మెడలో మంగళసూత్రాల గురించి, ఎక్కువ మంది పిల్లలను కనేవారంటూ.. ఎవరు మాట్లాడారు?' అని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పడం మోదీకి అలవాటు అని టీఎంసీ ఎంపీ సాగరిక ఘోష్ విమర్శించారు.

8 సార్లు ఓటేసిన బీజేపీ నేత కుమారుడి అరెస్టు

లక్నో, మే 20: లోక్‌సభ ఎన్నికల నాలుగో విడతలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్ నియోజకవర్గంలోని ఓ పోలింగ్ కేంద్రంలో బీజేపీకి 8 సార్లు ఓటేసిన యువకుడిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు సోమవారం వెల్లడించారు. నిందితుడు ఎటా జిల్లా ఖిరియా పరమాన్ గ్రామ సర్పంచి, బీజేపీ నేత అనిల్ ఠాకూర్ కుమారుడిగా గుర్తించారు. అతని వయసు 17 ఏండ్లే కావడం గమనార్హం. నయగావ్ పోలీసుస్టేషన్ పరిధిలోని పోలింగ్ బూత్ నంబర్ 343లో 7-8 సార్లు ఓటేసినట్టు తేలింది. ఓటేసే సమయంలో సెల్ఫ్ వీడియో తీసుకొన్న యువకుడు దాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అది వైరల్ కావడంతో రాజకీయ దుమారం రేగింది. ఫేక్ ఓటింగ్ ఘటనపై ప్రతిపక్ష ఎస్పీ, కాంగ్రెస్ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశాయి. సంబంధిత పోలింగ్ బూత్‌లో రీపోలింగ్‌కు సిఫారసు చేసినట్టు యూపీ ఎన్నికల ప్రధానాధికారి తెలిపారు.

'పూరీ జగన్నాథుడు మోదీ భక్తుడు'

నోరు జారిన బీజేపీ అభ్యర్థి

భువనేశ్వర్: ఒడిశాలోని పూరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సంబిత్ పాత్ర నోరు జారారు. పూరీ జగన్నాథుడు మోదీ భక్తుడంటూ వ్యాఖ్యానించారు. దీనిపై రాజకీయ దుమారం రేగింది. సంబిత్ పాత్ర వ్యాఖ్యల్ని సీఎం నవీన్ పట్నాయక్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఏఐసీసీ-ఒడిశా ఇన్‌చార్జ్ అజయ్ కుమార్ ఖండించారు. ఈ అంశంపై సంబిత్ పాత్ర వివరణ ఇస్తూ, 'పూరి జగన్నాథ్‌కు ప్రధాని మోదీ గొప్ప భక్తుడు అని చెప్పబోయి.. నోరు జారాను. ఈ అంశాన్ని పెద్దది చేయకండి' అంటూ 'ఎక్స్'లో సందేశాన్ని పోస్ట్ చేశారు.

నేను ఆరెస్సెస్ సభ్యుడిని

వీడ్కోలు ప్రసంగంలో కలకత్తా హైకోర్టు జడ్జి చిత్తరంజన్ దాస్

కోల్‌కతా: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ చిత్తరంజన్ దాస్ సోమవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన వీడ్కోలు సందర్భంగా హైకోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తాను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) సభ్యుడినని చెప్పారు. ఈ విషయం కొందరికి రుచించదని వ్యాఖ్యానించారు. ఆరెస్సెస్ నేతలు పిలిస్తే మళ్లీ వెళ్లడానికి తాను సిద్ధమేనన్నారు. తాను చేయగలిగిన సహాయం లేదా పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. తాను బాల్యం నుంచి ఆరెస్సెస్‌లో ఉన్నానని, ధైర్యంగా, నిజాయితీగా ఉండటం; ఇతరులను సమానంగా చూడటం, అన్నిటికీ మించి దేశ భక్తి, పని పట్ల నిబద్ధత వంటివాటిని తాను అక్కడ నేర్చుకున్నానని చెప్పారు.

చైనా కమ్యూనిస్టు పార్టీతో బీజేపీ సమావేశాలు!

న్యూఢిల్లీ: చైనా కమ్యూనిస్టు పార్టీ అధికారులకు, బీజేపీ నేతలకు మధ్య 2008 తర్వాత 12 సమావేశాలు జరిగాయని, వాటి వివరాల్ని బయటపెట్టాలని కాంగ్రెస్ సోమవారం డిమాండ్ చేసింది. 'చాలావరకు సమావేశాలు చైనాలో జరిగాయి. లఢక్ ఘర్షణల తర్వాత ప్రధాని మోదీ చైనాకు క్లీన్‌చిట్ ఇచ్చారు. చైనాకు దీటుగా ఎదురునిలవడానికి బీజేపీ ఎందుకు ఇష్టపడటం లేదన్నది భారత ప్రజలు అడుగుతున్నారు. ఇరు పార్టీల మధ్య సన్నిహిత సంబంధాలే దీనికి కారణమా?' అని కాంగ్రెస్ ప్రశ్నించింది.

తైవాన్ అధ్యక్షుడిగా లై

'వేర్పాటువాది'గా పరిగణిస్తున్న చైనా

తైపే: తైవాన్ నూతన అధ్యక్షుడిగా లై చింగ్-తే (64) సోమవారం బాధ్యతలు చేపట్టారు. గత నాలుగేండ్లపాటు తైవాన్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ఆయన.. త్సై ఇంగ్-వెన్ నుంచి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. జపాన్ వలసరాజ్య కాలంలో సెంట్రల్ తైపేలో నిర్మించిన అధ్యక్ష కార్యాలయంలో లై ప్రమాణ స్వీకారం చేశారు. తైవాన్‌ను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న చైనాను నిలువరించడం ఆయన ముందున్న ప్రధాన సవాళ్లలో ఒకటి. తైవాన్ సార్వభౌమాధికార దేశంగా కొనసాగడంపై ఆగ్రహంతో రగిలిపోతున్న చైనా లైని వేర్పాటువాదిగా పరిగణిస్తున్నది. కానీ, తైవాన్ అధ్యక్షునిగా లై తన తొలి ప్రసంగంలోనే చైనా పట్ల సుహృద్భావాన్ని వ్యక్తం చేశారు. చైనాతో శాంతిని కోరుకుంటున్నట్టు తెలిపారు. స్వయంపాలనతో ముందుకు సాగుతున్న తైవాన్‌పై సైనిక బెదిరింపులను ఆపాలని చైనాకు విజ్ఞప్తి చేశారు. తైవాన్ జలసంధికి ఇరువైపులా శాంతిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

మూడేండ్లలో 50 లక్షల వృక్షాల నరికివేత!

మధ్యభారతంలోని సాగు భూముల్లోనే అత్యధికం

కేసీఆర్ హయాంలో 283.71 కోట్ల మొక్కలకు జీవం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): దేశంలోని సాగుభూముల్లో ఏండ్లుగా పెరుగుతున్న భారీ వృక్షాలు పెద్ద యెత్తున నరికివేతకు గురవుతున్నాయి. గడిచిన మూడేండ్లలోనే 50 లక్షల వృక్షాలు అంతర్ధానమైనట్టు ఓ అధ్యయనం వెల్లడించింది. మధ్యభారతం, మహారాష్ట్రలో చెట్ల నరికివేత పెరిగినట్టు వెల్లడించింది. వ్యవసాయ భూముల్లో వరి, గోధుమ వంటి పంటలను వేయడానికి వృక్షాలను పెద్దయెత్తున నరికేసినట్టు అధ్యయనం పేర్కొంది. దీంతో పక్షులు, చిన్న జీవులు ఆవాసాలను కోల్పోవడమే కాకుండా.. జీవవైవిధ్యం దెబ్బతింటున్నట్టు పేర్కొంది.

తెలంగాణకు హరితహారం

సాగు భూముల్లో భారీ వృక్షాల నరికివేత తెలంగాణలోనూ జరిగినట్టు అధ్యయనం వెల్లడించింది. అయితే, తెలంగాణను ధాన్యాగారంగా మార్చడానికి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం సాగును ప్రోత్సహించడమే మార్గమని భావించింది. ఈ క్రమంలో వ్యవసాయానికి తగినంత నీరు, 24 గంటల కరెంటు సరఫరాను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. 2014-15లో యాసంగి, వానకాలం కలిపి 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం.. 2022-23లో 2.09 కోట్ల ఎకరాలకు (60% పెరుగుదల) పెరిగింది. సాగు భూముల్లో నరికివేతకు గురైన వృక్షాల వల్ల పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటుందని భావించిన కేసీఆర్ సర్కారు.. 'హరితహారం' పథకం కింద తొమ్మిదేండ్లలో ఏకంగా 283.71కోట్ల మొక్కలను నాటింది.

ఇరాన్ అధ్యక్షుడు రైసీ దుర్మరణం

మొదటిపేజీ తరువాయి...

బయటపడలేని పేర్కొన్నది. ప్రమాద స్థలానికి చేరుకున్న రెస్క్యూ బృందాలు, అక్కడి పరిస్థితిని సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీకి చేరవేశాయి. అధ్యక్షుడి మృతి నేపథ్యంలో ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ మొఖ్బర్‌ను తాత్కాలిక అధ్యక్షుడిగా ఖమేనీ నియమించారు. ఆది వారం సాయంత్రం ఇరాన్ అధ్యక్షుడు రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కూలిపోయిన విషయం తెలిసిందే. అజర్ బైజాన్ సరిహద్దులో డ్యామ్ ప్రారంభోత్సవానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. భారీ వర్షం, పొగమంచు కారణంగా హెలికాప్టర్ క్రాష్ ల్యాండ్ అయినట్టు ఇరాన్ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. మానవ రహిత విమానాల సాయంతో గాలింపు చేపట్టిన అధికారులు చివరికి ప్రమాద స్థలిని గుర్తించగలిగారు. సోమవారం ఉదయం ఘటనాస్థలానికి చేరుకున్న బృందాలకు విరిగి ముక్కలైన హెలికాప్టర్ శకలాలు కనిపించాయి.

ప్రమాద స్థలిలో విమాన శకలాలు, మృతదేహాల తరలింపు

ఇరాన్‌కు అండగా ఉంటాం: భారత్

ఇరాన్ అధ్యక్షుడు రైసీ మృతిపై భారత్, రష్యా, పాక్ సహా పలు దేశాలు సంతాపాన్ని ప్రకటించాయి. 'ఈ దుఃఖ సమయంలో ఇరాన్‌కు అండగా ఉంటాం' అని భారత ప్రధాని మోదీ 'ఎక్స్'లో సందేశాన్ని పోస్ట్ చేశారు. రైసీ మృతికి నివాళిగా భారత్‌లో మంగళవారం సంతాప దినం పాటించాలని హోం శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అధికారిక భవనాలపై జాతీయ జెండాను అవనతం చేయాలని తెలిపింది. అధికారిక వినోద కార్యక్రమాలేవీ నిర్వహించరాదని పేర్కొన్నది.

మా ప్రమేయం లేదు: ఇజ్రాయెల్

యుద్ధంలో హమాస్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ డ్రోన్, మిస్సైల్ దాడులు జరిపింది. ఇది జరిగిన నెల రోజులకు హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు రైసీ చనిపోవడం పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే దుర్ఘటనలో తమ ప్రమేయం లేదని ఇజ్రాయెల్ స్పష్టంచేసింది. 2021లో అధ్యక్షుడిగా రైసీ బాధ్యతలు చేపట్టిన తర్వాత యురేనియం శుద్ధీకరణలో ఇరాన్ మరింత ముందడుగు వేసింది. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు మద్దతుగా డ్రోన్లను సరఫరా చేసింది. దీంతో పాశ్చాత్య దేశాలు-ఇరాన్‌కు మధ్య ఉద్రిక్తతను మరింత పెంచాయి. రైసీ హయాంలో దేశంలో పెద్ద ఎత్తున నిరసన జ్వాలలు, దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించటం..వంటివి చోటుచేసుకున్నాయి.

రొమ్ము క్యాన్సర్‌కు 'జెల్'తో చెక్!

- మహిళల్లో కనిపించే రొమ్ము క్యాన్సర్ చికిత్సలో ముందడుగు
- శరీరం అవతల రొమ్ము కణజాలాన్ని భద్రపరిచే కొత్త జెల్
- ఏ డ్రగ్ సమర్థంగా పనిచేస్తుందో పరిశీలించే వెసులుబాటు
- రొమ్ము క్యాన్సర్ చికిత్సలో గేమ్ ఛేంజర్‌గా కితాబు
- 2022లో ప్రపంచ వ్యాప్తంగా 6.7 లక్షల మంది మృతి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): మహిళలకు పెనుశాపంగా మారిన రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కీలక ముందడుగు పడింది. రొమ్ము నుంచి సేకరించిన కణజాలాన్ని శరీరానికి అవతల ఏకంగా వారంపాటు భద్రపరిచే కొత్త జెల్ అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్ పరిశోధకులు వెల్లడించారు. రొమ్ము క్యాన్సర్ పరిశోధనలకు, క్యాన్సర్ చికిత్సకు ఈ సాంకేతికత ఓ గేమ్‌ఛేంజర్ అని పరిశోధకులు అభివర్ణిస్తున్నారు.

ఈ జెల్‌తో లాభమేంటి?

సాధారణంగా రొమ్ము క్యాన్సర్‌కు గురైన మహిళలకు చికిత్సలో భాగంగా కొన్ని మందులను ఇస్తారు. అయితే, జన్యుక్రమాన్ని బట్టి ఈ మందులు కొందరికి పనిచేయవచ్చు. మరికొందరికి పనిచేయకపోవచ్చు. దీంతో వేరే డ్రగ్స్ వాడటానికి సమయం మించిపోవడంతో బాధితులు మరణించేవారు. అయితే, తాజా జెల్ సొల్యూషన్‌లో క్యాన్సర్‌కు గురైన మహిళ రొమ్ము కణజాలాన్ని వారంపాటు భద్రపర్చవచ్చని పరిశోధకులు తెలిపారు. ఈ సమయంలో క్యాన్సర్ కణాలకు వ్యతిరేకంగా ఏ డ్రగ్ సమర్థంగా పనిచేస్తుందో జెల్‌లో ఉంచిన కణజాలానికి ఇవ్వడం ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఒకవేళ ఆ మందులు సమర్థంగా పనిచేస్తే.. వాటినే బాధితులకు ఇచ్చినట్లైతే, క్యాన్సర్‌ను నయంచేయడంతో పాటు మరణాలను కూడా తగ్గించవచ్చని తెలిపారు. ఈ వివరాలు 'నియోప్లాసియా', 'మామరీ గ్లాండ్ బయాలజీ' జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలకూ..

ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న క్యాన్సర్ మహమ్మారిలో రొమ్ము క్యాన్సరే ప్రధానమైంది. ప్రపంచంలోని *157* దేశాల మహిళల్లో ఎక్కువగా కనిపిస్తున్న క్యాన్సర్ కూడా ఇదే. ప్రపంచవ్యాప్తంగా *2022*లో ఒక్క ఏడాదే ఈ క్యాన్సర్‌తో *6,70,000* మంది మరణించారు. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది.

భారత్‌లో రొమ్ము క్యాన్సర్ ఇలా..

- ప్రతి లక్ష మంది మహిళల్లో కేసులు-*31.3*
- ప్రతి *4* నిమిషాలకు ఒక కేసు నమోదవుతున్నది
- ప్రతి *8* నిమిషాలకు ఒకరు ఈ క్యాన్సర్‌తో మరణిస్తున్నారు.

టాల్కమ్ పౌడర్‌తో అండాశయ క్యాన్సర్!

- ఆరేండ్లపాటు 50 వేల మంది మహిళలపై చేసిన అధ్యయనంలో వెల్లడి
- మహిళలు జననాంగాల్లో టాల్కమ్ పౌడర్ వాడొద్దని నిపుణుల సూచన

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే *20* (నమస్తే తెలంగాణ): ఇంట్లో రోజూ వాడే టాల్కమ్ పౌడర్‌తో మహిళల్లో అండాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్నదని అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధకులు పేర్కొన్నారు. జననాంగాలపై టాల్కమ్ పౌడర్‌ను తరుచుగా వాడే మహిళల్లో ఈ ప్రమాదం ఎక్కువగా ఉన్నట్టు వెల్లడించారు. మహిళలు జననాంగాల్లో టాల్కమ్ పౌడర్ వినియోగాన్ని నిలిపివేయాలని సూచించారు. *2003-2009* మధ్య అమెరికాలోని *50,884* మంది మహిళలపై ఈ పరిశోధనలు చేసినట్టు వివరించారు. ఈ వివరాలు 'జర్నల్ ఆఫ్ క్లినికల్ ఆంకాలజీ'లో ప్రచురితమయ్యాయి.



ఏమిటీ